

కొత్తగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

మైనార్టీ సెల్‌కు నూతన సభ్యుల నియామకం

యూసు‌ఫ్‌గూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్‌కు సోమవారం నియామకాలు చేపట్టారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తన కార్యాలయంలో నూతన సభ్యులకు నియామకపత్రాలు అందజేసి అభినందించారు. జూబ్లీహిల్స్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఇక్బాల్, రహ్మత్‌నగర్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడిగా అహ్మద్‌బాయ్, డీసీసీ సికింద్రాబాద్ జనరల్ సెక్రటరీగా మహ్మద్ మన్సూర్ నియమితులయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్

11న వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు

బంజారాహిల్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు ఈ నెల 11న అధికారికంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడ కమ్యూనిటీ హాల్‌లో వడ్డెర సంఘం (గన్ను దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు అంతయ్య అధ్యక్షతన సోమవారం ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జైపాల్ మాట్లాడుతూ.. ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ.. వడ్డెర్లు ఐక్యంగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో గుంజ రేణుక, పల్లపు అశోక్, మక్కల వెంటేష్, వల్లెపు లక్ష్మీనారాయణ, ఓర్సు అడివయ్య, గండికోట కుమార్, దేరంగుల శంకర్, రమేష్ మంజల్కర్, బోధస్ శ్రీనివాస్, గోగుల శ్రీశైలం, దేరంగుల బాలరాజ్, ఎత్తరి హరి పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

బంజారాహిల్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమాజ్‌వాదీ పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మదిరె నర్సింగ్‌రావు నియమితులయ్యారు. లక్నోలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆదేశాల మేరకు ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మాజీ మంత్రి వ్యాస్ జీ గోండ్ చేతుల మీదుగా నర్సింగ్‌రావు నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పార్టీ సీనియర్ నేత దండుబోయిన నిత్య కల్యాణ యాదవ్‌తో కలిసి నర్సింగ్‌రావు సోమవారం అఖిలేష్‌యాదవ్‌ను కలిశారు. తెలంగాణలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వారికి అఖిలేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ సభ జాతీయ అధ్యక్షుడు రాహుల్ నిగమ్ వసి పాల్గొన్నారు.

స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్

ఎర్రగడ్డ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 విద్యుత్ సౌధ రీజనల్ బాడీ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్ నియమితులయ్యారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కల్లెం శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లెం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నూతనంగా కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎం.ఎ వజీర్, ఉపాధ్యక్షులు సిర్ర ఆనంద్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు కల్లెం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కేబీ సలీంలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీచైతన్య స్కూల్, హనుమాన్ టెంపుల్ ఫీడర్ల పరిధిలోని శ్రీచైతన్య స్కూల్, రోడ్ నంబర్లు 8, 9, 10, 11, కాకతీయ హిల్స్, సినీనటి విజయశాంతి ఇల్లు, హనుమాన్ టెంపుల్, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి ఇల్లు, శ్రీనివాస్‌రావు ఇంటి ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెహర్‌బాబా, భారతీయ విద్యాభవన్ స్కూల్ ఫీడర్ల పరిధిలోని రోడ్ నంబర్లు 1, 2, 3, 4, 5, 6, 7, కాకతీయ హిల్స్, సినీ రచయిత పి.గోపాల్ కృష్ణ ఇల్లు, సినీనటుడు బాబూమోహన్ ఇల్లు, ఆంధ్రజ్యోతి లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాటిగడ్డ క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని పాటిగడ్డ క్వార్టర్స్, నూర్ బాగ్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పైగా ప్యాలెస్, బేగంపేట షాపర్స్ స్టాప్ ఫీడర్ల పరిధిలోని పాటిగడ్డ రోడ్, నవాబ్ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్, భగత్‌సింగ్ నగర్, బృందావన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

సోదరి డీపీతో మెసేజ్.. రూ.75 వేలు మోసపోయిన యువతి

యూసు‌ఫ్‌గూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తన సోదరి అనుకుని గుర్తు తెలియని వ్యక్తికి రూ.75వేలు పంపించి యువతి మోసపోయిన ఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సిద్ధార్థనగర్ పార్కు ఎదురుగా నివసించే మాధురీ కాజా ఫోన్‌కు ఈ నెల 5న తన చెల్లెలి ఫొటో ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. అర్జెంట్‌గా రూ.75వేలు కావాలని, మెడికల్ ఎమర్జెన్సీ అని అందులో పేర్కొంది. తన సోదరి వేరే నంబర్ తీసుకుందేమోనని భావించిన మాధురి రూ.75వేలు పంపించింది. తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలికపై స్నేహితుడి అత్యాచారం

యూసు‌ఫ్‌గూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఆమె స్నేహితుడు అత్యాచారం చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరంలోని ఓ ప్రాంతంలో నివసించే దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒకరికి వివాహం కాగా, మిగతావారు చదువుకుంటున్నారు. ఈ నెల 2న తల్లిదండ్రులు పనికి వెళ్లగా రెండో కుమార్తె కడుపులో నొప్పిగా ఉందని ఇంట్లోనే ఉంది. ఆ సమయంలో ఇంటికి వచ్చిన తన స్నేహితుడు రాహుల్ బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బేగంపేట వైట్‌హౌస్ బిల్డింగ్‌లోని ఓ హోటల్‌లో సోమవారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వినియోగదారులు, సిబ్బంది బయటికి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. స్వల్ప ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

పాత వస్తువులను వృథా చేయకండి

- తమకు ఇస్తే అవసరం ఉన్నవారికి ఇస్తామంటున్న జీహెచ్‌ఎంసీ
- అవసరం ఉన్న వారు ఉచితంగా తీసుకెళ్లే అవకాశం
- గుడ్‌విల్ స్టోర్‌కు మంచి ఆదరణ వస్తుందంటున్న అధికారులు
- త్వరలో మరిన్ని స్టోర్‌లు ఏర్పాటు చేసే ఆలోచన

ఖైరతాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మనం వినియోగించే ఎన్నో వస్తువులను అవసరం తీరిన తర్వాత అలాగే వదిలేస్తాం. అయితే వాటిని తమకు ఇస్తే వృథా కాకుండా అవసరం ఉన్న వారికి ఇస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. పిల్లల ఆట వస్తువులు, వినియోగంలో లేని దుస్తులు, బొమ్మలు, పాత వస్తువులు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, చెప్పులు, ఫర్నిచర్ తదితరాలను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన స్టోర్‌కు అప్పగిస్తే వాటిని అవసరమున్న వారు తీసుకునే సౌకర్యాన్ని కల్పించారు. సర్కిల్ 17 వైద్యాధికారి చంద్రశేఖర్ ఆలోచనలకు ప్రతిరూపంగా రాజ్‌భవన్ రహదారిలో ఏర్పాటైన గుడ్‌విల్ స్టోర్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. స్టోర్‌లో ఏర్పాటైన ర్యాక్‌లలో వస్తువుల వారీగా పేర్చగా అవసరం ఉన్నవారు వచ్చి వాటిని సంతోషంగా తీసుకెళ్తున్నారు.



రాజ్‌భవన్ రోడ్డులోని గుడ్‌విల్ స్టోర్

అందుబాటులో సిబ్బంది

జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ గుడ్‌విల్ స్టోర్‌లో ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచారు. గతంలో తాగునీటి ఏటీఎంగా, అనంతరం మిగిలిపోయిన వంటకాలను భద్రపరిచి పేదలకు అందించిన స్టోర్‌గా పేరుగాంచినా అవి నిర్వహణ లోపంతో మూతపడ్డాయి. అదే స్థలంలో విదేశాలలో మాత్రమే అందుబాటులో ఉండే గుడ్‌విల్ స్టోర్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో వైద్యాధికారి చంద్రశేఖర్ ర్యాక్‌లను తయారు చేయించారు. ఎవరైనా అవసరం లేని వస్తువులను ఇందులో ఇవ్వాలని అవగాహన కల్పిస్తుండటంతో చాలా మంది దుస్తులతో పాటు బొమ్మలు, చెప్పులు, ఆటవస్తువులు, స్కూళ్లలో వినియోగించే తెల్లటి బోర్డులు తెచ్చి ఇస్తున్నారు. ఇందులోంచి తమకిష్టమైన వాటిని ఎవరైనా తీసుకునే అవకాశం ఉండటంతో చాలా మంది దుస్తులను ఎంచుకొని తమ సైజులకు అనుగుణంగా తీసుకెళ్తుండటం కనిపిస్తోంది.



స్టోర్ నుంచి వస్తువులను తీసుకుంటున్న ప్రజలు

ఓ ప్రైవేటు స్కూల్ నుంచి కొన్ని తెల్లటి బోర్డులు రాగా, వాటిని ప్రభుత్వ పాఠశాలకు అందజేశారు. అవసరం లేని చెప్పులు, ఆట వస్తువులు, ఫర్నిచర్‌తో పాటు ఎన్నో రకాల గృహోపకరణాలను చాలామంది ఉచితంగా ఇస్తున్నారు. స్టోర్‌లో ఉన్న అవసరమైన వాటిని చాలామంది తీసుకుంటుండడంతో స్టోర్‌కు తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు లభించింది. ఈ క్రమంలో త్వరలోనే సర్కిల్ 18 (జూబ్లీహిల్స్)లో సైతం ఇలాంటి స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ భార్గవ్ నారాయణ తెలిపారు. రోడ్ నంబరు 36 లోని కొత్త చెరువుతో పాటు ఇందిరానగర్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

స్టోర్‌ను సద్వినియోగం చేసుకోండి



రాజ్‌భవన్ రోడ్డులోని గుడ్‌విల్ స్టోర్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అవసరం లేని వస్తువులను ఇక్కడ ఇవ్వొచ్చు. అవసరం ఉన్న వారు ఉచితంగా తీసుకెళ్లొచ్చు. స్టోర్ కోసం 9849884432 నంబర్‌లో సంప్రదించవచ్చు. ఆదివారం స్టోర్‌కు సెలవు.

- డాక్టర్ చంద్రశేఖర్, సర్కిల్ 17 వైద్యాధికారి

'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు'కు తరలిరావాలి

- మాదిగ కులస్థులకు మంద కృష్ణమాదిగ పిలుపు

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో మూడు పదవులు పొందిన కుటుంబాలు జాతీయ స్థాయిలో సోనియా గాంధీ, రాష్ట్రంలో వెంకటస్వామి కుటుంబమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా బీసీ, నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ నేత దరువు అంజన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు బీసీ, నిరుద్యోగ కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ అందరికీ ఉపయోగపడే పనులు చేస్తూ వస్తోందని, వివిధ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. మాల సామాజికవర్గంలో కొందరు మాత్రమే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని, అయినా సమాజం తమ పోరాటానికి అండగా ఉందన్నారు. ఆర్థికంగా ఎదిగిన జి.వెంకటస్వామి కుటుంబం వర్గీకరణను అడ్డుకుంటోందని ఆరోపించారు. వారిది దేశంలోనే అత్యంత ధనిక దళిత వర్గం అన్నారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు ప్రదర్శన, సభకు పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ వెంకటేష్ నేత, పలు సంఘాల నాయకులు ఎస్.పృథ్వీరాజ్ యాదవ్, ఎన్.వి అశోక్, బీసీ కళామండలి అధ్యక్షుడు రామలింగం, ఏ.వెంకన్న, ఎన్.కిరణ్, గణేష్, పి.సైదులు, వరంగల్ రవి, ఆర్.రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన వినతులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 44 అర్జీలు వచ్చాయి. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 4 విన్నపాలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్లు శివకుమార్‌నాయుడు, నళిని పద్మావతి, పంకజ, గీతారాధిక, రఘుప్రసాద్, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్

ఖైరతాబాద్‌లో తగ్గిన ఓటర్లు

- 6,575 ఓట్లను తొలగించిన అధికారులు
- గత అక్టోబరులో 3,01,160 మంది ఓటర్లు
- ప్రస్తుతం 2,94,585 లకు తగ్గిన సంఖ్య

ఖైరతాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో 6 వేల పైచిలుకు ఓటర్లు తగ్గారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ అనంతరం వచ్చిన దరఖాస్తులను, అభ్యంతరాలను పరిశీలించి సోమవారం తుది ఓటరు జాబితాను నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.ప్రశాంతి విడుదల చేశారు. గత సంవత్సరం అక్టోబరు 29న విడుదల చేసిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం ఖైరతాబాద్‌లో 3,01,160 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,56,009 మంది, మహిళలు 1,45,116, ఇతరులు 35 మంది ఉన్నారు. తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో 6,575 మంది ఓటర్లు తగ్గారు. అధికారుల వివరాల ప్రకారం ప్రస్తుతం ఇక్కడ 2,94,585 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,52,412 మంది, మహిళలు 1,42,136 మంది, ఇతరులు 37 మంది ఉన్నారు. గతంతో పోలిస్తే 3,597 మంది పురుషులు, 2,980 మంది మహిళలు తగ్గారు. ఇతరులు మాత్రం ఇద్దరు పెరిగారు. ఇటీవలి కాలంలో చనిపోయిన ఓటర్లను తొలగించడంతో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గింది. ఈ నియోజకవర్గంలో 109 ప్రాంతాల్లో 245 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రశాంతి వెల్లడించారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు తీర్పుచెప్పింది. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికపై ఇండ్ల కార్తీక్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.3లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చారు.

కిడ్నాప్ కేసులో..

బాలికను కిడ్నాప్ చేసి వివాహం చేసుకోవాలని బలవంతం చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని పోక్సోకోర్టు తీర్పు చెప్పింది. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కురుమూర్తి అనే యువకుడు ఓ బాలికను అపహరించుకునిపోయి వివాహం చేసుకోవాలని బలవంతం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయగా.. విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు విధించడంతో పాటు రూ.10 వేలు జరిమానా, బాధితురాలికి రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

చెత్త సేకరణకు వీల్ బ్యారర్స్

బోరబండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ సర్కిల్-19 పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు ఊడ్చిన చెత్తను సేకరించడానికి కొత్తగా 50 వీల్ బ్యారర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సర్కిల్-19లో 35 మంది ఎస్‌ఎఫ్‌ఏలకు 35 వీల్ బ్యారర్స్, ప్రధాన రహదారుల్లో రోడ్లు శుభ్రం చేస్తున్న కార్మికులకు 15 అందజేస్తారు. దీంతో చెత్తను ఊడ్చిన కార్మికులు వెంటనే వీల్ బ్యారర్స్‌లో తరలిస్తారు. ఈ పరికరాలతో సిబ్బందికి సౌకర్యవంతంగా ఉంటుందని, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించే అవకాశం ఉందని పారిశుధ్య విభాగం అధికారులు చెబుతున్నారు. త్వరలోనే మరిన్ని పరికరాలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న వీల్ బ్యారర్స్

ప్రజలు సహకరించాలి

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్కిల్-19 శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ అన్నారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీలు, ఎస్‌ఎఫ్‌ఏలు, పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించినప్పుడే బస్తీలు చెత్త రహితంగా మారతాయని ఆయన పేర్కొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ, కార్పొరేటర్ దేదీప్య

ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో మధురానగర్ డి-బ్లాక్ లో నిర్వహించిన ముగ్గుల పోటీకి మంచి స్పందన లభించింది. యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన వారికి మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ, స్థానిక కార్పొరేటర్ దేదీప్య బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎన్.వి.రమణ, ముఖ్య సలహాదారు అంజయ్య, జీఎస్ సతీష్‌కుమార్, సభ్యులు సునీత రాజశేఖర్ గుప్త, ఏ.శశికళ తదితరులు పాల్గొన్నారు.



వరల్డ్ రికార్డ్స్ యూనియన్ సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న శ్రీవాత్సవ తదితరులు

క్యూసీఎఫ్‌ఐకి వరల్డ్ రికార్డ్స్ యూనియన్ పురస్కారం

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశీయ పరిశ్రమల్లో నాణ్యత, భద్రత అంశాలపై అవగాహన కల్పిస్తున్న క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్‌ఐ)కు అత్యున్నత పురస్కారం దక్కింది. అమెరికాకు చెందిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ అత్యున్నత ప్రమాణాలతో మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతున్న సంస్థలకు అందించే పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే శ్రీవాత్సవ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన జాతీయ కన్వెన్షన్‌లో 12,117 మంది ప్రతినిధులు పాల్గొని నాణ్యత ప్రమాణాలపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. దిగ్గజ సంస్థలైన బీహెచ్‌ఈఎల్, రైల్వే, ఎన్‌ఎండీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థల అభివృద్ధికి చేయూతనందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఫ్యాకల్టీ ఆర్.శ్రీనివాసన్, డైరెక్టర్లు మనోహర్ హెగ్డే, చేతన్ చిత్రాల్కర్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తిరుమల బ్యాంక్ క్యాలెండర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్యాంక్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సోమవారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సద్గురు దయానిధి స్వామీజీ, తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, జితేందర్ తివారీ పాల్గొన్నారు. త్వరలో ప్రారంభించనున్న బ్యాంక్ మూడవ బ్రాంచ్ ప్రారంభించడానికి రావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ఆహ్వానించినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

పనుల పరిశీలన



రహ్మత్‌నగర్ వెజిటబుల్ మార్కెట్ వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

- యూసుఫ్‌గూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి)

కబ్జాదారుల నుంచి స్థలాన్ని రక్షించండి

● అధికారులకు దివ్యాంగురాలు స్వప్నరెడ్డి విజ్ఞప్తి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వప్నరెడ్డి

మారేడుపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లిలోని తన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి రక్షించి తనకు అప్పగించాలని అధికారులకు దివ్యాంగురాలు స్వప్నరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మారేడుపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓల్డ్ మారేడుపల్లిలో దాదాపు 50 గజాల ఖాళీ స్థలంపై తాము 60 సంవత్సరాలుగా హక్కుదారుగా ఉన్నామని తెలిపారు. ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టారని, వెంటనే స్థలాన్ని తమకు అప్పగించాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొంతమంది అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నారని ఆమె వాపోయారు. స్థలం ఆక్రమణ విషయమై స్థానిక తహసీల్దార్‌తో పాటు ఆర్డీఓకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇప్పటి వరకూ వారు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని త్వరలోనే ప్రజాపాలనలో, హైడ్రా దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని అధికారులకు బాధితురాలు విజ్ఞప్తి చేశారు.


డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, రామచందర్ తదితరులు

ఫార్మా డైరీని ఆవిష్కరించిన పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ విబ్సన్ ఫార్మా వార్షిక డైరీని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, విబ్సన్ ఫార్మా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్(సీఎండీ)తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఇటీవల ఫార్మారంగంలో ఆధునాతన మార్పులు చోటు చేసుకున్నాయని, రోగులకు మేలు చేకూర్చేలా అన్ని సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విబ్సన్ ఫార్మా సంస్థ తన విశిష్ట సేవలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం ప్రశంసనీయమన్నారు. అనంతరం సుంకు రామచందర్ మాట్లాడుతూ లాభాపేక్షత కాకుండా తమ సంస్థ సీఎస్ఆర్ నిధులతో వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వారాసిగూడ పోచమ్మ ఆలయ వీధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

వారాసిగూడలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే

బౌద్ధనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోచమ్మ ఆలయవీధిలో సోమవారం జీహెచ్ఎంసీ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే చేశారు. జీహెచ్ఎంసీ ఎంటమాలాజీ విభాగపు అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి వివరాలను సేకరించారు. వారిని ప్రసుత్తం ఉంటున్న ఇంటిముందు నిల్చోబెట్టి ఫొటోలను తీశారు. సుమారు వంద వరకు దరఖాస్తులను పరిశీలించామని అధికారులు తెలిపారు. అయితే, చాలామంది సొంత ఇళ్లు ఉన్న వారు కూడా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా సర్వేలో వివరాలను సేకరిస్తున్నామని, సొంత ఇళ్లు అయితే సొంతిళ్లు, అద్దె ఇంటిలో ఉంటే అద్దెళ్లని నమోదు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.శివకుమార్, జె.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఓబీసీ కోశాధికారి రమేష్

బీసీ రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలి

బౌద్ధనగర్/చిలకలగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చిలకలగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన కుల గణన సర్వేను సవ్యంగా నిర్వహించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు తగిన గుర్తింపు ఇచ్చి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాజేశ్వరి, సరోజ, యుద్ధవీర్, శ్రీను, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న భాగ్యశ్రీ

మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

తిరుమలగిరి జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి శ్రీనగర్ కాలనీ వాసులకు మంచినీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలూ తీస్కుంటున్నామని కంటోన్మెంటు బోర్డు 7వ వార్డు మాజీ సభ్యురాలు భాగ్యశ్రీ తెలిపారు. శ్రీ నగర్ కాలనీలో సోమవారం మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. వచ్చే వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె అన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్, 7వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా ఓల్డ్ గాంధీ నగర్‌లో బోర్‌వెల్ నీటితో పాటు పబ్లిక్ నల్లా కనెక్షన్ ఏర్పాటు చేశారు.

సిమెంట్ దిమ్మెలే వ్యాపారుల అడ్డా

● ట్రాఫిక్ పోలీసుల హెచ్చరికలు బేఖాతర్

● సిమెంట్ దిమ్మెలను తొలిగించిన ట్రాఫిక్ పోలీసులు


సిమెంట్ దిమ్మెల పక్కన తోపుడుబండ్లపై వ్యాపారాలు


సిమెంట్ దిమ్మెలను తొలిగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రెజిమెంటల్‌బజార్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అవుట్ గేట్ వద్ద గతంలో మోండా మార్కెట్ వైపు వెళ్లకుండా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెల పక్కన పండ్ల వ్యాపారులు నాలుగు చక్రాల బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు దిమ్మెలపై చిరు వ్యాపారులు సామగ్రి ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. వీరి వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో రైలు దిగివచ్చే ప్రయాణికులు, రైల్వే పార్సిల్ కార్యాలయానికి వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించినా మళ్లీ పెడుతున్నారు. అక్కడ వ్యాపారాలు కొనసాగించకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు సిమెంట్ దిమ్మెలను తొలగించారు.

పదిహేను సంవత్సరాల క్రితం..

పదిహేను సంవత్సరాల క్రితం రైల్వేస్టేషన్ లోపలి నుంచి వచ్చే వాహనాలు సాఫీగా వెళ్లడానికి సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. మోండా మార్కెట్‌కు రాకపోకలు సాగించే వాహనాలు, రైల్వేస్టేషన్ అవుట్ గేట్ నుంచి బయటకు వచ్చే వాహనాలు కలవడం వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యేది. ఈ సమస్యను పరిష్కరించడానికి అప్పటి మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రామస్వామి సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చిరు వ్యాపారులు ఆ సిమెంట్ దిమ్మెలే అడ్డాగా వ్యాపారాలు చేస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తుండడంతో ట్రాఫిక్ పోలీసులు వాటిని తొలిగించారు.

మూవింగ్ బారికేడ్‌లు ఏర్పాటు చేస్తాం



సిమెంట్ దిమ్మెలు ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్ అయినప్పుడు వాహనాలను మళ్లించే అవకాశం లేకుండా పోతుంది. సిమెంట్ దిమ్మెల స్థానంలో మూవింగ్ బారికేడ్‌లు ఏర్పాటు చేస్తాం. దీని వల్ల అవసరానికి అనుగుణంగా పక్కకు జరిపి వాహనాలను పంపవచ్చు, మళ్లీ పెట్టవచ్చు. సిమెంటు దిమ్మెలు కిందికి ఉండటం వల్ల వ్యాపారులు, ప్రయానికులు వాటి మీద కూర్చుంటున్నారు. దీని వలన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

- శంకర్ రాజు, నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ

వారం రోజులు చూస్తాం



ఫుట్‌పాత్ వ్యాపారులు సిమెంట్ దిమ్మెల పక్కన బండ్లు, వ్యాపార సామగ్రి ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు లేదు. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. సాఫీగా వాహనదారులు, పాదచారులు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా సిమెంట్ దిమ్మెలు తొలిగించాం. వారం రోజులు పరిశీలిస్తాం. అంతా బాగుంటే అలాగే కొనసాగిస్తాం. లేదంటే అప్పుడు ఇంకా ఏ మార్పులు చేయాలో ఆలోచిస్తాం.

- ఉపశంకర్, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

శ్రీధర్మశాస్త్ర భక్త బృందం సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


శబరికి వెళ్తున్న నిత్యవసర సరకుల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములకు శ్రీధర్మశాస్త్ర భక్త బృందం అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సోమసుందరం వీధిలో ఆవుల మందకు చెందిన శ్రీధర్మశాస్త్ర భక్త బృందం ఆధ్వర్యంలో శబరిమల పెద్దపాదంలో అయ్యప్ప స్వాములకు నిర్వహించే అన్నప్రసాద వితరణ కోసం నిత్యవసర సరుకులతో కూడిన వాహనాన్ని తలసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శబరిమలకు వచ్చే స్వాములకు 12 సంవత్సరాల నుంచి అన్న ప్రసాద వితరణ చేయడంతో పాటు మండలం రోజుల పాటు స్థానికంగా అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ, అల్పాహార వితరణ చేస్తున్న శ్రీధర్మశాస్త్ర భక్త బృందం సభ్యులను అభినందించారు. ఈనెల 8,9,10 తేదీలలో మూడు రోజల పాటు సుమారు 40 వేల మంది స్వాములకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆంజేయులు, శ్రీధర్మశాస్త్ర భక్తబృందం నిర్వాహకులు వెంకటేష్, సురేష్, చందా శ్రీను, కొత్త సంజయ్, మణికంఠ, లలితా ప్రసాద్, నాయకులు మహేష్ యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు తలసానికి ఆహ్వానం

మారేడుపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలలో పాల్గొనాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పలు దేవాలయాల నుంచి ఆహ్వానాలు అందాయి. ఈ మేరకు సోమవారం అమీర్‌పేట డివిజన్ ఎస్సార్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బాపూనగర్‌లోని శ్రీవీర హనుమాన్ దేవాలయాల ఈఓ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వెస్ట్ మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా సికింద్రాబాద్‌లోని నామాలగుండులో గల శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ చైర్మన్ నేముల ప్రకాష్ ఆహ్వానాన్ని అందజేశారు. సనత్‌నగర్‌లోని కేఎల్ఎన్ పార్క్ చైర్మన్ షాబాద్ శ్రీనివాసరావు, టిల్లు బాయ్, కె.ప్రకాష్‌గౌడ్, మధుసూదన్‌రావు, వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను పూర్తి చేయండి

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి


నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ పంక్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు

తార్నాక, జనవరి 6(ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి లాలాపేట్‌లో పర్యటించిన డిప్యూటీ మేయర్ లాలాపేట్‌లో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌తో పాటు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, పలువురు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతుభరోసా ఏడాదికి రూ.15వేలు ఇవ్వాలి

● జక్కుల మహేశ్వర్‌రెడ్డి


జేబీఎస్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు

బోయిన్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసాను ఎకరాకు యేడాదికి రూ. 15వేలు ఇవ్వాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఎకరాకు యేడాదికి రూ.15వేలు నుంచి రూ.12 వేలకు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా సోమవారం బోయిన్‌పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, పాండు యాదవ్, నళిని కిరణ్, అనిత ప్రభాకర్, లోకనాధం కార్యకర్తలతో కలిసి ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హామీలను నిలబెట్టుకోలేకపోయినందుకు లక్షల మంది రైతులకు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతులు ఇకపై కాంగ్రెస్ పార్టీని విశ్వసించరని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రైతులకు కాంగ్రెస్ సర్కార్ చేసిన మోసాలను వివరిస్తూ పలు ప్రాంతాలలో ఇంటింటికి గోడ పత్రికలను అంటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, జయరాం, సురేష్, ప్రవీణ్‌తో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చెస్ విజేతలు సాయి, ఆరాధ్య


పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జానకి మోడల్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ బాలుర విభాగంలో సీహెచ్ ధ్రుపత్ సాయి, బాలికల కేటగిరీలో ఆరాధ్య విజేతలుగా నిలిచారు. సోమవారం బోయినపల్లిలో జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో ధ్రుపత్ సాయి ప్రథమ స్థానంలో నిలవగా, మానస్ ద్వితీయ, జైదీప్ రెడ్డి తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. బాలికల కేటగిరీలో ఆరాధ్య టైటిల్ సాధించగా, ఆరాధన రన్నరప్, హైమ తృతీయ స్థానంతో సరిపెట్టుకున్నారు. స్థానిక ఎస్సై వి.శివశంకర్ విజేతలకు ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేశారు.

అరుంధతీయ బంధు సేవామండలి అధ్యక్షుడు నర్సింగరావు మృతి

బౌద్ధనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అరుంధతీయ బంధు సేవామండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగరావు(82) ఆదివారం రాత్రి సీతాఫల్‌మండి మేడిబావిలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సింగరావు నాలుగు దశాబ్దాల పాటు మాదిగ కులస్థుల అభివృద్ధి, మనుగడ కోసం పని చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, అరుంధతీయ బంధు సేవామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యేంద్రకృష్ణ తదితరులు నర్సింగరావు పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. సోమవారం సీతాఫల్‌మండి శ్మశానవాటికలో నర్సింగరావు అంత్యక్రియాలను నిర్వహించారు.

11న వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్

బంజారాహిల్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు ఈ నెల 11న అధికారికంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడ కమ్యూనిటీ హాల్‌లో వడ్డెర సంఘం (గన్ను దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు అంతయ్య అధ్యక్షతన సోమవారం ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జైపాల్ మాట్లాడుతూ.. ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ మాట్లాడుతూ.. వడ్డెర్లు ఐక్యంగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో గుంజ రేణుక, పల్లపు అశోక్, మక్కల వెంటేష్, వల్లెపు లక్ష్మీనారాయణ, ఓర్సు ఆదివయ్య, గండికోట కుమార్, దేరంగుల శంకర్, రమేష్ మంజల్కర్, బోధస్ శ్రీనివాస్, గోగుల శ్రీశైలం, దేరంగుల బాలరాజ్, ఎత్తరి హరి పాల్గొన్నారు.



వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ఇచ్చిన సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న డీకే శ్రీవాత్సవ, సీనియర్ ఫ్యాకల్టీ శ్రీనివాసన్, డైరెక్టర్లు మనోహర్ హెగ్డే, చేతన్ చిత్తాల్కర్

క్యూసీఎఫ్ఐకి వరల్డ్ రికార్డ్స్ యూనియన్ పురస్కారం

పంజాగుట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశీయ పరిశ్రమల్లో నాణ్యత, భద్రత అంశాలపై అవగాహన కల్పిస్తున్న క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ)కు అత్యున్నత పురస్కారం దక్కింది. అమెరికాకు చెందిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ అత్యున్నత ప్రమాణాలతో మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతున్న సంస్థలకు అందించే పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే శ్రీవాత్సవ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన జాతీయ కన్వెన్షన్‌లో 12,117 మంది ప్రతినిధులు పాల్గొని నాణ్యత ప్రమాణాలపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. దిగ్గజ సంస్థలైన బీహెచ్ఈఎల్, రైల్వే, ఎన్ఎండీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థల అభివృద్ధికి చేయూతనందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఫ్యాకల్టీ ఆర్.శ్రీనివాసన్, డైరెక్టర్లు మనోహర్ హెగ్డే, చేతన్ చిత్తాల్కర్ తదితరులు పాల్గొన్నారు.

సోదరి డీపీతో మెసేజ్.. రూ.75 వేలు మోసపోయిన యువతి

యూసుఫ్‌గూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తన సోదరి అనుకుని గుర్తుతెలియని వ్యక్తికి రూ.75వేలు పంపించి యువతి మోసపోయిన ఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సిద్ధార్థనగర్ పార్కు ఎదురుగా నివసించే మాధురీ కాజా ఫోన్‌కు ఈ నెల 5న తన చెల్లెలి ఫొటో ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. అర్జెంట్‌గా రూ.75వేలు కావాలని, మెడికల్ ఎమర్జెన్సీ అని అందులో పేర్కొంది. తన సోదరి వేరే నంబర్ తీసుకుందేమోనని భావించిన మాధురి రూ.75వేలు పంపించింది. తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలికపై స్నేహితుడి అత్యాచారం

యూసుఫ్‌గూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఆమె స్నేహితుడు అత్యాచారం చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరంలో నివసించే దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒకరికి వివాహం కాగా, మిగతావారు చదువుకుంటున్నారు. ఈ నెల 2న తల్లిదండ్రులు పనికి వెళ్లగా రెండో కుమార్తె కడుపులో నొప్పిగా ఉందని ఇంట్లోనే ఉంది. ఆ సమయంలో ఇంటికి వచ్చిన రాహుల్ బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.